
# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

గురువారం 3 ఏప్రిల్ 2025 పేజీలు 8

గుంటూరు పల్నాడు

నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1)తో

## చిన్నారి మృతి

- పచ్చి కోడి మాంసం తినటం వల్లనే వైరస్ సోకింది
- చికెన్ తినే వాళ్ళు తప్పనిసరిగా 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తినాలి

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1) రెండేళ్ల చిన్నారి మరణించింది. ఏపీలో ఇదే మొదటి కేసు. పచ్చి కోడి మాంసం తినే అలవాటుతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం చిన్నారి మరణానికి దారితీసిందని వైద్యులు గుర్తించారు. బర్డ్‌ఫ్లూ కారణంగానే చిన్నారి మరణించినట్లు భారత వైద్య పరిశోధన మండలి కూడా నిర్ధారించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. మార్చి 16న బాలిక చనిపోగా, వివిధ స్థాయిల్లో నమూనాలను పరీక్షించి అధికారికంగా ధ్రువీకరించారు. బర్డ్‌ఫ్లూ కారణంగా మనుషుల మరణం సంభవించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది.

**పరీక్షలు :**

నరసరావుపేటకు చెందిన చిన్నారిని జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, మూర్ఛ, విరేచనాలు, ఆహారం తినలేని పరిస్థితిలో మార్చి 4న మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు బాలికకు ఆక్సిజన్ సాయంతో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మార్చి 16న మృతిచెందింది. అయితే, చికిత్స అందించే సమయంలో మార్చి 7న పాప గొంతు, ముక్కు నుంచి తీసిన స్వాబ్ నమూనాలను ఎయిమ్స్‌లోని వీఆర్‌డీఎల్‌లో పరీక్షించారు. ఇన్‌ఫ్లుయెంజా ఎ పాజిటివ్‌గా తేలింది. అనంతరం మరో నమూనాను 15న దిల్లీలో పరీక్షించారు. అక్కడ నివేదిక అనుమానాస్పదంగా రావడంతో అప్రమత్తమైన ఐసీఎంఆర్.. 24న స్వాబ్ నమూనాలను పుణెలోని ఎన్ఐవీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ)కి మిగతా 3వ పేజీలో

# పిడుగు పడిందా..! ప్రాణాలు గోవిందా..!!



పిడుగు.. దీని పేరు వింటేనే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. అసలే తీవ్రమైన ఎండలు.. ఈదురు గాలులు. వాతావరణంలో విపరీతమైన వేడి. ఇలాంటి తరుణంలో ఆకాశంలో ధడ...దడ మంటు విపరీతమైన శబ్దాలతో పిడుగులు పడుతూ ఉంటాయి. ఇవి పడే ముందు వచ్చే శబ్దాల వల్ల అనారోగ్యంతో, గుండె జబ్బులు, ఇతర రోగాలతో ఉన్న వ్యక్తులు కూడా అమాంతంగా పడిపోయి ప్రాణాలు కోల్పోతారు. పిడుగు పడేటప్పుడు వచ్చే మెరుపులు కళ్లపై పడి కంటి చూపు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. పిడుగులు పడటం వల్ల పొలాల్లో మేతమేస్తున్న వందలాది మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆకాశంలో 25 వేల అడుగుల ఎత్తులో ఏర్పడిన మేఘాల లో పెను మార్పులు సంభవించి రాపిడి జరిగి తీవ్రమైన ఉష్ణోగ్రతతో కూడిన పిడుగులు పెడతాయి. భయంకరమైన పిడుగు చెరువు నీళ్లలో పడితే ఆ నీరంతా ఆవిరైపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. పిడుగు పడే సమయాన్ని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చు. వాతావరణ పరిశోధన శాఖ కూడా గత మూడు సంవత్సరాల నుంచి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పిడుగులు ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలో, ఎలా పడతాయో కూడా తెలియజేస్తోంది. తరచూ ఆస్తి నష్టం కూడా జరుగుతోంది. ప్రజానీకం కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పిడుగుపాటు ప్రమాదాల నుంచి ప్రాణ, ఆస్తి నష్టాన్ని కాపాడుకోవచ్చు...

- గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో

**వామ్మో... పిడుగు**

- పిడుగులు ఎందుకు పడతాయి
- పిడుగుపాటును ముందే గుర్తించవచ్చా
- జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు
- గుండె జబ్బు రోగులు జాగ్రత్తగా ఉండాలి

వర్షాకాలం మొదలవడంతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడుతుంటాయి. ఈ క్రమంలోనే కొన్నిచోట్ల పిడుగులు పడి ఎంతో మందిరైతులు,మూగజీవాలు మరణిస్తున్న సంఘటనల గురించి మనం వినే ఉంటాం. అసలు పిడుగులు ఎందుకు పడతాయి..? పిడుగులు అంటే ఏమిటి? పిడుగులు పడే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను గురించి మనం ఇక్కడ తెలుసుకుందాం... సాధారణంగా ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు సముద్రం, చెరువులలో నీరు ఆవిరి రూపంలో మారి సుమారుగా భూమి నుంచి 25 వేల అడుగుల ఎత్తులో మేఘాలు ఏర్పడతాయి. ఈ క్రమంలోనే మేఘాలపై నుంచి అధిక సూర్యరశ్మి తాకడం వల్ల తక్కువ బరువు ఉన్న ధనావేశిత(o) మేఘాలు పైకి వెళ్లి,అధిక బరువుండే రుణావేశిత (-) మేఘాలు కిందికి వస్తాయి. అంటే వర్షం వచ్చే సమయంలో మనకు కనిపించే నల్లని మేఘాలు అధిక బరువుండే రుణావేశిత మేఘాలు. సైన్స్ ప్రకారం ఎప్పుడూ కూడా అధిక బరువు కలిగినటువంటి రుణావేశిత మేఘాలలోని ఎలక్ట్రాన్లు తక్కువ బరువు ఉన్నటువంటి ధనావేశిత ఎలక్ట్రాన్లను ఆకర్షిస్తాయి. అయితే ధనావేశిత ఎలక్ట్రాన్లు తక్కువ బరువు కారణంగా పైకి వెళ్ళిపోయాయి కనుక రుణావేశిత ఎలక్ట్రాన్లు పైకి ప్రవహించే లేక వాటికి దగ్గరగా ఉన్నటువంటి వస్తువు అంటే భూమి పై ఒక్కసారిగా అధిక ఎలక్ట్రాన్లు విడుదల చేస్తాయి. దీనినే మనం పిడుగు అంటాము. ఆవిధంగా మేఘాల నుంచి ఉరుములు మెరుపులు మిగతా 3వ పేజీలో



## ఎయిమ్స్ అభివృద్ధికి ప్రణాళిక

- కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి
- ఆసుపత్రి మౌలిక సదుపాయాలను పెంచాలి
- 1054 పోస్టులను మంజూరు చేయాలి
- ఎయిమ్స్‌కు ఏటా రూ.250 కోట్లు కేంద్ర నుంచి అదనంగా అందే అవకాశం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఆచరణలో మెళకువ, మాటకు కట్టుబడే నిబద్ధత కలిగిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తన నెక్స్ట్ డెవలప్మెంట్ టార్గెట్ను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (ఎయిమ్స్) వైపు గురి పెట్టారు. ఆర్వోబీ, రహదారులు, గుంటూరు ఛానెల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను నెలల వ్యవధిలోనే గుంటూరుకు సాధించుకు వచ్చిన ఆయన లక్ష్యం ఇపుడు ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి వైపు మళ్లించారు. ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనను కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఢిల్లీ కార్యాలయంలో కలిసి వివరించారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన ఆమె సుముఖంగా స్పందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రయత్నం మిగతా 3వ పేజీలో




## ఆరు రూట్లలో సిటీ బస్సులు నడుపుకునేందుకు 54 దరఖాస్తులు

**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో ప్రైవేటు సిటీ బస్సుల రూట్ల అనుమతులకు సంబంధించి బుధవారం కలెక్టరేట్ లోని డిఆర్సి సమావేశ మందిరంలో జరిగిన ఆర్ టీ ఏ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ పాల్గొన్నారు. జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి పెదపలకలూరు వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుండి లాం వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అడవి తక్కెళ్ళపాడు వరకు, పాత గుంటూరు మణి హోటల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి మిగతా 3వ పేజీలో

## రుణమేళాకు స్పందన 112 మంది హాజరు



**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :** మండల పరిషత్తు కార్యాలయం వద్ద వివిధ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల రుణమేళా ఇంటర్వ్యూలు బుధవారం జరిగాయి.యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సత్తెనపల్లి బ్రాంచి,చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ముప్పాళ్ళ బ్రాంచి,ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మాదల బ్రాంచి నుంచి ఆయా బ్యాంకుల మేనేజర్లు సిబ్బంది హాజరై ఇంటర్వ్యూ లు నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ రకాల కార్పొరేషన్ల 42 సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూ జరగగా మండలం మొత్తం మీద ఆన్లైన్ లో 174 మంది దరఖాస్తులు చేసుకున్నారు.బుధవారం జరిగిన రుణమేళా ఇంటర్వ్యూలకు 112 మంది హాజరయ్యారని ఎంపిడివో కాశయ్య తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ప్రక్రియలో ఈవోపీర్డి రూపావతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటికి శుభాకాంక్షలు తెలిపిన జడ్పీ ఛైర్పర్సన్

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్**



ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణ స్వీకార సందర్భంగా ఆయన ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, తెలుగుదేశం నాయకుడు సుద్దపల్లి నాగరాజు . ఆలపాటి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు..

## టిడిపిపై దుష్ప్రచారం చేస్తున్నారు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టిడిపి పై దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. బుధవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు కు టిడిపి మద్దతు ప్రకటించటం పై వైసీపీ పార్టీ లేనిపోని అపోహలను సృష్టిస్తుందని అన్నారు. సవరణ బిల్లులో నాలుగు అంశాలకు గాను మూడు అంశాలను టిడిపి మద్దతు ఇచ్చిందని తెలిపారు. వాక్ఫ్ బోర్డ్ లో ముస్లిమేతరులను చేర్చటం అనే నాలుగో అంశంని టిడిపి వ్యతిరేకిస్తుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఏనాడు ముస్లిం మైనారిటీల అభివృద్ధి గురించి మాట్లాడలేదని అన్నారు. నేడు ముస్లిం సోదరుల పట్ల జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారు. పార్లమెంటులో బిల్లుని ఆమోదం చేయడానికైనా బీజేపీకి స్పష్టమైన ఆధిక్యత ఉందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కావాలనే టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నారు. మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లు ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ఏమి చేశారో బహిరంగంగా చెప్పాలన్నారు. ముస్లిం మైనారిటీలు జగన్మోహన్ రెడ్డి మాయలో పడొద్దని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు మద్దతు ఇవ్వనంత మాత్రాన పార్లమెంటులో వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదించటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొన్నారు.

# 'మున్సిపల్ కార్మికులకు 21వేల వేతనం ఇవ్వాల్సిందే'

### ఎంసిపిఐ(యు)పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా డిమాండ్




**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని గత 14 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నా..ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కరువైందని ఎంసిపిఐ(యు)పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం రెడ్ బాషా కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల న్యాయపరమైన కోరికలు తీర్చాలని, అలాగే పెరిగిన ఆర్థిక ఖర్చులకు అనుగుణంగా వేతనాలను రూ.21వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులకు మద్దతుగా భారత బొల్విస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య), ఎంసీపీఐ (యు) పోరాటం చేయటానికి సిద్ధంగా ఉందని చెప్పారు.

# ఏప్రిల్ నుంచి ఉచితంగా ఐదు లక్షల బీమా.. వీళ్ళు మాత్రమే అర్హులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**




ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల పథకం 70 ఏళ్ళు దాటిన వృద్ధులు కూడా వర్తించనుంది. ఏప్రిల్ నుంచి ఉచితంగా ఈ పథకాన్ని అమలు చేయనుంది కేంద్ర ప్రభుత్వం. ఆయుష్మాన్ భారత్ వయో వందన స్కీం అమలు కానుంది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం ఫ్రీగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య భీమా అందించనుంది. ఇందులో ఉచిత చికిత్సతో పాటు సర్జరీలు, మెడిసిన్ అందించనుంది. ఈ పథకం అమలుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య అధికారులు 416 నెట్వర్క్ ఆసుపత్రిలో కు తాజాగా ఆదేశాలు కూడా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆరోగ్య బీమా ఎన్నో ఆసుపత్రులు లింక్ అయి ఉన్నాయి. ప్రభుత్వం నేరుగా ఆస్పత్రులకు బిల్లు చెల్లిస్తుంది. అయితే దీనికి ముందుగా ఆయుష్మాన్ భారత్ యోజనాలలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ పథకం లబ్ది పొందుతారు. అయితే ఈ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అన్ని చికిత్సలు అందిస్తారు. కానీ కాస్మోటిక్ సర్జరీ, డెంటల్, ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్, ఒబెసిటీ, మానసిక సమస్యలకు మాత్రం చికిత్స అందించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి ఐదు లక్షలు ఆరోగ్య బీమా అందిస్తారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన 2025 నిరుపేదకి కుటుంబాలకు 70 ఏళ్ళు దాటిన సీనియర్ సిటిజన్లో కూడా దీనికి అర్హులు. ఇది వరకు వయస్సు పెద్ద ఉన్నవారికి ఆరోగ్య బీమా ప్రైవేటు రంగాలు అవకాశం ఇచ్చేవి కావు.

**వీలు మాత్రమే అర్హులు ..**

ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ యోజనలో భారత్ శాశ్వత నివాసితులై ఉన్నవారు మాత్రమే అర్హులు. సీనియర్ సిటిజెన్లు 70 ఏళ్ళు పైబడిన వారు కూడా అర్హులు, వీళ్ళు కార్డు కలిగి ఉండాలి. ఆదాయం అర్బన్, రూరల్ ఏరియాలకు నిర్దేశిత ఆదాయ పరిమితిని మించి ఉండకూడదు. ఆయుష్మాన్ భారత్ యోజన కార్డు కలిగి ఉంటే ఐదు లక్షల వరకు ఆరోగ్య భీమాను పొందుతారు. ఉచిత చికిత్సలు పొందుతారు. ఉచితంగా మెడిసిన్స్ అందిస్తారు. ఎమర్జెన్సీ ఇతర సర్వీసులు కూడా పొందుతారు. ఇవన్నీ నిరుపేద కుటుంబాలకు వర్తిస్తాయి. మీరు కూడా ఈ ఆయుష్మాన్ భారత్ యోజన పొందాలంటే అధికారిక వెబ్సైటులో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి మీ రిజిస్టర్ మొబైల్ నెంబర్కు ఓటీపీ వస్తుంది. అక్కడ మీ ఆధార్ కార్డు ఇతర వివరాలు నమోదు చేసి వెరిఫికేషన్ చేస్తే ఆధార్ కార్డు పొందుతారు.

# నేటినుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మరలా 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. పెండింగ్లో ఉన్న 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారులందరూ ఈ సదావకాశాన్ని వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారుల్లో 1,95,735 మందికి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా, వీరందరూ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించుకోలేదు. ఆధార్ నమోదు చేయించుకోని చిన్నారుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 12,218 మంది, అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 4,001 మంది చిన్నారులున్నారు. ఆధార్ క్యాంపులను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు.

# జిఎంసి ఆదాయ వనరులకు సంబంధించి టెండర్లు పిలిచి ఆదాయం పెంచుతాం..

### నగర ఇన్చార్జి మేయర్ షేక్ సజిలా



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్ లకు టెండర్ నిర్వహించి జిఎంసికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని, గత నెల 27న జరిగిన టెండర్ కం బహిరంగ వేలంలో హెచ్చు టెండర్ దాఖలు చేసిన వారి టెండర్లను స్టాండింగ్ కమిటి ఆమోదించిందని నగర ఇంచార్జి మేయర్ షేక్ సజిలా తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఇంచార్జి మేయర్ షేక్ సజిలా నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఇంచార్జి మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన 13 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్ లు, మార్కెట్లకు మార్చి 27న సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం చేపట్టగా టెండర్ దార్లు పాల్గొని టెండర్ దాఖలు చేశారని, టెండర్ లో పాల్గొని, అధిక బిడ్ దాఖలు చేసిన వాటిని స్టాండింగ్ కమిటి విపులంగా చర్చించి ఆమోదించిందని తెలిపారు. ఆమోదించిన వాటిలో డాక్టర్ కొల్లి శారదా హోల్ సేల్ కూరగాయల మార్కెట్ లో రుసుం వసూళ్ళు చేసిన హక్కు, పివికె నాయుడు మార్కెట్ లోపల కూరగాయలు, వెలుపల ఆకుకూరల వర్తకుల నుండి రుసుం వసూళ్లు చేసుకునే హక్కు, విజ్ఞాన మందిరం రోడ్డులోని మరుగుదొడ్డు, పింక్ టాయ్ లెట్స్, తహసిల్దార్ ఆఫీస్ వద్ద, నాజ్ సెంటర్ లోని మరుగుదొడ్లను నిర్వహించి రుసుం వసూళ చేసుకునే హక్కు, వెన్ లాక్ మార్కెట్ సెల్లార్ లో సైకిల్ స్టాండ్ నిర్వహించి రుసుం వసూళ్లు చేసే హక్కు, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్ లో రుసుం వసూళ్లు చేసుకునే హక్కు, అరండల్ పేట 1వ లైన్లోని పచ్చగడ్డి మార్కెట్ లో రుసుం వసూళ్లు చేసుకునే హక్కు, గాంధీ పార్క్ లోని క్యాంటీన్ నిర్వహణ, పివికె నాయుడు మార్కెట్ ఉత్తరం, దక్షిణ ఫెన్సింగ్ లో సైకిల్ స్టాండ్ నిర్వహించి రుసుం వసూళ్లు చేసుకునే హక్కు, గాంధీ పార్క్ లో మెయిన్ గేటుకి కుడివైపు పార్కింగ్ నిర్వహించి రుసుం వసూళ్లు చేసుకునే హక్కు, సంగ్రీస్ మార్కెట్ లో దిగుమతి చేయు పండ్లకు రుసుం వసూళ్లు చేసుకునే హక్కు పొందిన టెండర్ దార్ల టెండర్లను ఆమోదించామని పేర్కొన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటి సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమీషనర్ డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రెటరి పి.శ్రీనివాస్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం పెరగాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు మేజర్ న్యూస్ :** అమరావతి ఎడు హబ్ నేషనల్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, పోటీ తత్వం పెరుగుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. అమరావతి ఎడు హబ్ 6 రాష్ట్రాలలో గణితం, విజ్ఞానం, ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ విభాగాలల్లో నిర్వహించిన పోటీలలో 20వేల మంది విద్యార్థులు పాల్గొనడం అందులో 150 మంది విద్యార్థులను గౌరవించడం, 40 మంది ఉపాధ్యాయులకు గురుదేవోభవ అవార్డులను అందించడం అభినందనీయమన్నారు. ఈనెల 2వ తేదీ గుంటూరులోని పెన్షనర్స్ భవన్ హాలులో జరిగిన బహుమతుల ప్రధానం కార్యక్రమానికి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన , డిబేటింగ్ క్విజ్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులలో ప్రశ్నించే లక్షణం పెరగాలని ,మంచి స్వప్నాలతో గమ్యాలను చేరుకోవడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని ఒప్ప చెప్పే పద్ధతికి స్వస్తి పలికి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ అవగాహన పెంచుకుంటూ విద్యను అభ్యసించాలని కోరారు. అమరావతి ఒలంపియడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు డి. లక్ష్మణరావు ప్రసంగిస్తూ విద్య ఎవరు దొంగలించలేని ఆస్తి అని నిరంతర అధ్యయనం ద్వారా విద్యార్థి వారి స్వప్నాలను సాకారం చేసుకోవాలన్నారు. అందమైన హస్త లేఖనం అలవాటు చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అమరావతి ఎడు హబ్ 6 వ జాతీయ బహుమతి ప్రధానోఉత్సవం మరియు గురుదేవోభవ అవార్డుల కార్యక్రమానికి విజేతలుగా విచ్చేసిన 150 మంది విద్యార్థులను, 40 మంది గురువులను అభినందించారు. విద్యార్థులు మౌనంగా ఉండకూడదని, నిరంతరం ప్రశ్నిస్తూ అన్వేషిస్తుంటేనే కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలు వస్తాయన్నారు. మరో విశిష్ట అతిథి గా విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్.వి పద్మిని ప్రసంగిస్తూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.ఆరోగ్య వంతంగా లేకుండా లక్ష్యాలను చేరుకోవడంలో విఫలం అవుతామని వివరిస్తూ ఆరోగ్య ప్రమాణాలను గుర్చి తెలిపారు.

# పిడుగు పడిందా.! ప్రాణాలు గోవిందా..!!







(మొదటి పేజీ తరువాయి)

వస్తున్న సమయంలోనే మేఘాలలో ఉన్న ఎలక్ట్రాన్లు భూమిని తాకుతాయి. ఫలితంగా అధిక వోల్టేజ్ భూమిని తాకడం వల్ల మనిషి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతారు. అయితే ఈ విధంగా పిడుగులు ఏ ప్రాంతంలో పడతాయో ముందుగానే అధికారులు గుర్తించి ఆ ప్రాంతంలోని ప్రజలకు ఫోన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే మనం ఈ పిడుగుపాటు నుంచి బయటపడవచ్చు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తున్నప్పుడు ఎవరు ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. ఒకవేళ పొలం పనులలో పనులు చేస్తున్నా వెంటనే ఇంటికి వెళ్ళాలి. అంతేకానీ చెట్ల కింద సెల్ టవర్ కింద కూర్చో కూడదు. కారులో ప్రయాణిస్తున్న వారు కారు దిగకుండా కారులో కూర్చోవడం ఎంతో ఉత్తమం. ఒకవేళ మనకి ఎలాంటి ఆశ్రయం లేకపోతే భూమిపై కాలి వేళ్ళ సహాయంతో కూర్చుని మన మోకాలిపై చేతులు,తల పెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవాలి. దాంతో ఆ పిడుగు పడినప్పుడు ఆ విద్యుత్ ప్రవాహం తీవ్రత మనపై తగ్గుతుంది. అదేవిధంగా అధిక ఉరుములు మెరుపులతో వర్షం పడితే ఇంట్లో సెల్ఫోన్లు, టీవీలు,ఫ్రిజ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఆఫ్ చేసి పెట్టుకోవడం ఎంతో ఉత్తమం.ఈ విధమైనటు వంటి జాగ్రత్తలను తీసుకోవడం వల్ల పిడుగుపాటు నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు.

**పిడుగు పడటాన్ని ముందే గుర్తించవచ్చా..!**

అసలు పిడుగు అంటే ఏమిటీ.. అది ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకోండి.. వర్షాకాలం వచ్చిందంటే చాలు పిడుగులు పడి ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరుగుతాయి. సాధారణంగా పిడుగు అనేది వర్షం కురుస్తున్నప్పుడు పడుతుంది. పిడుగు పాటు కారణంగా దేశంలో ఏటా దాదాపు 2వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక మూగ జీవాలు కూడా చనిపోతున్నాయి. పిడుగులు ఎప్పుడు, ఎక్కడ పడతాయో ముందే అంచనా వేయడంతో పాటు, ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రాణ, ఆస్తి నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పిడుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించే వరకూ పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయి. ఆ సమయంలో సముద్రంలో నుంచి వచ్చే గాలుల్లో తేమ శాతం పెరిగితే దట్టమైన క్యూములోనింబస్ మేఘాలు కమ్ముకుంటాయి. అప్పుడే ఉరుములు ప్రారంభమవుతాయి. పిడుగులు పడుతుంటాయి.

**పిడుగు అంటే ఏమిటి? అవి ఎలా పుడతాయి?**

ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25,000 అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. అయితే పై నుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువున్న ధనావేశిత(ం) మేఘాలు పైకి వెళ్తాయి. అధిక బరువుండే రుణావేశిత (ఎలక్ట్రాన్లు అధికంగా ఉన్న) మేఘాలు కిందికి వస్తాయి. సైన్స్ ప్రకారం, రుణావేశిత మేఘాలలోని ఎలక్ట్రాన్లు సమీపంలోని ధనావేశిత మేఘాలవైపు ఆకర్షితమవుతుంటాయి. ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లిపోయినప్పుడు దగ్గరలో మరే వస్తువు ఉన్నా అటువైపు ఎలక్ట్రాన్లు ప్రయాణిస్తాయి. ఆ క్రమంలోనే మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ క్షేత్రంగా మారి భూమి మీదకు దూసుకొస్తాయి. దాన్నే 'పిడుగు పడటం' అంటారు అలా మేఘాల నుంచి పడే 'పిడుగు'లో దాదాపు 30 కోట్ల వోల్టుల విద్యుత్ ఉంటుంది. పిడుగుపాటును ముందస్తుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ వినియోగిస్తోంది. అందుకోసం అమెరికాకు చెందిన ఎర్త్‌నెట్ వర్క్‌తో పాటు, ఇస్రో సహకారం తీసుకుంటోంది. 2017లో ఎర్త్ నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలో సెన్సర్ల ఏర్పాటు చేశారు. ఎక్కడ ఏ సమయంలో పిడుగులు పడే అవకాశముందో ఈ సెన్సర్ల ద్వారా అధికారులు ఓ అంచనాకు వస్తారు. దాంతో మండలాల వారీగా ప్రజల ఫోన్లకు ఎస్సెమ్మెస్‌లు పంపి అప్రమత్తం చేస్తున్నారు. దీని ద్వారా 30 నుంచి 40 నిమిషాల ముందే పిడుగు పడబోయే ప్రాంతాన్ని గుర్తించవచ్చు.

**పిడుగుల నుంచి తప్పించుకోవడం ఎలా?**

ఉరుములు మెరుపులు వస్తున్నప్పుడు ఇంట్లో ఉంటే బయటకు రాకపోవడమే మంచిది. పొలాల్లో పనిచేసే రైతులు ఇళ్లకు లేదా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. భూమి పొడిగా ఉన్న చోటుకి వెళ్లాలి. చెట్ల కిందకు, టవర్ల కిందకు వెళ్లకూడదు. సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియో వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించకూడదు. ఉరుములు, మెరుపులు, గాలీవాన సమయంలో బైక్‌లు నడపరాదు. ఒకవేళతలదాచుకునేందుకు ఆశ్రయం లేనప్పుడు తమను తాము రక్షించుకునేందుకు ప్రయత్నించాలి. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవాలి. దాంతో ఆ పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం మన మీద తక్కువగా పడే అవకాశం ఉంటుంది. ఒకవేళ నీటిలో ఉన్నట్టయితే సాధ్యమైనంత త్వరగా బయటకు వెళ్లాలి. ఉరుముల సమయంలో ఇళ్లలో ఉన్న వారు తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇళ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లను ఆపేయాలి. లేదంటే పిడుగు పడినప్పుడు విద్యుత్ తీగల ద్వారా హై వోల్టేజీ ప్రవహించడంతో అవి కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి. ఉరుములు మెరుపులు వస్తున్నప్పుడు స్నానం చేయడం, పాత్రలు కడగటం ఆపేస్తే మంచిది. ఎందుకంటే లోహపు పాత్రలు, పైపుల ద్వారా ఒక్కసారిగా పెద్దమొత్తంలో విద్యుత్ ప్రవహించే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ప్రకృతి %బఎ% విపత్తుల నష్టం కింద ప్రభుత్వం 4 లక్షల పరిహారం అందిస్తుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఇదే తరహా పరిహారం అమలవుతోంది.

# నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1)తో చిన్నారి మృతి

(మొదటి పేజీ తరువాయి)

పంపించింది. అక్కడ హెచ్5ఎన్1 వైరస్‌గా నిర్ధారించారు.

**కుటుంబ సభ్యుల విచారణ :**

వైద్యారోగ్య శాఖ అధికారులు తాజాగా చిన్నారి కుటుంబ సభ్యులను విచారించారు. పెంపుడు, వీధి కుక్కలతో బాలిక తరచూ ఆడుకునేదని వారు చెప్పారు. చిన్నారిలో ఫిబ్రవరి 28న జ్వర లక్షణాలు కన్పించగా, అంతకు రెండురోజుల ముందు పచ్చి కోడి మాంసం తిన్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు వివరించారు. బాధిత కుటుంబం నివసించే ఇంటికి కిలోమీటరు దూరంలో ఒకరు మాంసం దుకాణం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. చిన్నారి ఇంటి సమీపంలో వైద్య ఆరోగ్యశాఖ జ్వర సర్వే చేసి, అనుమానిత లక్షణాలున్న వారెవరూ లేరని తేల్చింది. స్థానికంగా ఈ తరహా కేసులేవీ నమోదు కాలేదని ప్రభుత్వానికి నివేదించింది. వైద్యారోగ్య శాఖ నుంచి ప్రత్యేక అధికారి శ్యామల మంగళవారం నరసరావుపేటకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను, స్థానికులను విచారించారు.

**చికెన్ పచ్చి మాంసం ముక్క తిన్నందుకే**

'కోడి కూర కోసే సమయంలో పాప అడిగితే ఒక ముక్క ఇవ్వగా, తిన్నదని, తర్వాతే జబ్బు పడిందని పాప కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలోనూ ఓసారి ఇలాగే ఇచ్చామన్నారు. ఉడికించిన మాంసం తిన్న మాకెవరికీ ఆరోగ్య సమస్యలు రాలేదని చిన్నారి తల్లి తెలిపారు

# ఆరు రూట్లలో సిటీ బస్సులు నడుపుకునేందుకు 54 దరఖాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు, గుజ్జనగుండ్ల నుంచి గుండవరం వరకు మొత్తం ఆరు రూట్లలో సిటీ బస్సులు తిప్పుకోవడానికి 54 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులు దరఖాస్తుదారులతో సమీక్షించారు. సిటీ బస్సుల అనుమతులకు సంబంధించి ఆర్టీసీ అధికారులు ఏప్రిల్ 9వ తేదీ నాటికి రిమార్కులు అందించాలని, అనంతరం అనుమతుల మంజూరుకు ఆర్ టీఏ కమిటీ చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. సమావేశంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణ కాంత్, ట్రాఫిక్ డిఎస్పి రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, దరఖాసుదారులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ అభివృద్ధికి ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ఏటా సుమారు రూ.250 కోట్లను ఎయిమ్స్కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు

**మాట ఇచ్చాను.. మరువను**

గడిచిన ఫిబ్రవరి 28న గుంటూరు పార్లమెంట్ పరిధిలోని నిర్మితమైన ఎయిమ్స్ ఆసుపత్రిని పెమ్మసాని పరిశీలించి, అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ అవసరాలు, అదనపు సౌకర్యాలతో పాటు సిబ్బంది, వైద్యుల లోటు అంశాలపై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. సమీక్షలో భాగంగా ఎయివమ్స్‌కు కావాల్సిన సౌకర్యాలను కేంద్రంతో మాట్లాడి ఏర్పాటుచేస్తానని, మాట ఇచ్చాను.. మరచిపోనని ఆనాడే పెమ్మసాని అధికారులు, వైద్యులకు స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు అణుగునంగా అడుగులు వేస్తూన్నారు. ప్రతిపాదనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

ప్రతిపాదనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదు పాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎయిమ్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని, విజయవాడ-గుంటూరు పరిధిలో నిర్మితమైన ఈ ఎయిమ్స్కు ఇరు జిల్లాల ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అయితే అందులో ఉన్న సిబ్బంది, సదుపాయాల కొరత ఆసుపత్రి, వైద్య విధానంపై ప్రభావం చూపుతుందన్నారు. అందుకు పరిష్కారంగా 105 ఫ్యాకల్టీ పోస్టులు, సీనియర్ రెసిడెంట్ పోస్టులు, జూనియర్ రెసిడెంట్ పోస్టులు.

**నర్సింగ్ కేడర్ పోస్టులు**

నాన్ - ఫేకల్టీ పోస్టులు, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ కమిటీ ఆమోదించిన ప్రకారం 960 పడకలను అందుబాటులోకి తేవాలని పెమ్మసాని కోరారు. కాబట్టి తమ ప్రతిపాదనను అత్యంత ప్రాముఖ్యతతో పరగణించి త్వరగా అనుమతులను మంజూరు చేయాలని ఆయన తెలిపారు. కాగా ప్రతిపాదనలను పూర్తిగా ఆలకించిన పిదప కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గారు స్పందిస్తూ పాజిటివ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఎల్లపుడూ సహకరిస్తాయని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్కు, ముఖ్యంగా ఏపీ ప్రజలకు ముఖ్యంగా గుంటూరు ప్రజల సౌకర్యార్థం తప్పక సహకరిస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

# బొమ్మల సెంటర్ రోడ్డులో పార్కింగ్ నిషేధం

**- రోడ్లపై ఉంచిన వాహనాల తీయకపోతే మేమే తొలగిస్తాం**



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ట్రావెలర్స్ బంగ్లా నుండి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు ప్రధాన రహదారి వెంబడి అనధికారికంగా పార్కింగ్ నిషేధమని, పార్కింగ్ చేసిన వాహనాలను 24 గంటల్లోగా (గురువారం) స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే ట్రాఫిక్ పోలీసులు, జిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది సమన్వయంతో వాటిని జెసిబిలతో తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులపై వాహనాలు రోజులతరబడి పార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారన్నారు. తొలి విడతగా టిబి బంగ్లా నుండి నగరంపాలెం 3 బొమ్మల వరకు ఇరువైపులా అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలను గురువారానికి తమ స్వంత స్థలాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అలా తొలగించని వాహనాలను ట్రాఫిక్ పోలీసులు, జిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది జెసిబిల ద్వారా తొలగిస్తారని, అందుకు పూర్తి భాధ్యత సంబందిత వాహన యజమానులే వహించాల్సి ఉంటుందని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : కన్నా





**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణం రఘు రామ్ నగర్ కన్నా కార్యాలయం నందు నిర్వహించిన. ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాలొ న్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసు తెలుసు కుంటానన్నారు. ప్రజల వినతులను స్వీకరించి వాటిని పరిశీలించి. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కృషి చేస్తానన్నారు. సమస్యలపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

# ఆలపాటికి శుభాకాంక్షలు తెలిపిన జడ్పీ చైర్మన్



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారి ప్రమాణ స్వీకార సందర్భంగా ఆయన ను కలసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, తెలుగుదేశం నాయకుడు సుద్ధపల్లి నాగరాజు . ఆలపాటి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# 3న బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో లబ్దిదారుల దరఖాస్తుల పరిశీలన

## - నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఏడాదికి సంబందించి ఆన్ లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్, మోనిటరింగ్ సిస్టం (ఓబిఎంఎంఎస్)లో ప్రభుత్వ స్వయం ఉపాధి పధకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ (గురువారం) బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో లబ్దిదారుల దరఖాస్తుల పరిశీలన క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓబిఎంఎంఎస్ ద్వారా ప్రభుత్వ స్వయం ఉపాధి పధకాలైన బిసి కార్పోరేషన్, కాపు కార్పోరేషన్, ఈబిసి కార్పోరేషన్, ఏపి వైశ్య కమ్యూనిటి కార్పోరేషన్, బ్రాహ్మణ కమ్యూనిటి కార్పోరేషన్, కమ్మ కమ్యూనిటి కార్పోరేషన్, క్షత్రియ కమ్యూనిటి కార్పోరేషన్, రెడ్డి కమ్యూనిటి కార్పోరేషన్లకు సంబందించి వార్షిక ప్రణాళిక, బ్యాంక్ లింక్డ్ స్కీంల లబ్దిదారులను ఎంపిక చేయడానికి, వారి దరఖాస్తులను పరిశీలించడానికి గురువారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు తూర్పు నియోజకవర్గం లబ్దిదారులకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్ ల జిరాక్స్ కాపీలు, ఒక పాస్ పోర్ట్ ఫోటోతో నిర్దేశించిన క్యాంప్ లకు హాజరు కావాలని కోరారు.

# దశాబ్ధాల సమస్యకు 10నెలల్లో పరిష్కారం చూపిన లోకేష్

**- మొదటి విడతలో3వేలమందికి శాశ్వత పట్టాలు**

**- ఏప్రిల్ 3న తొలి పట్టా అందజేయనున్న మంత్రి నారా లోకేష్**



మంగళగిరి, మేజర్ న్యూస్:

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత అయిదేళ్లు అడ్రస్ లేకుండా వెళ్లిపోయిన ప్రజాప్రతినిధులను ఇప్పటి వరకు చూశాం. ఇచ్చిన హామీలు నిలుపుకొని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట నిలుపుకున్నారు. గతదశాబ్ధాలుగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఒక జఠిల సమ స్యకు మంత్రి 10నెలల్లోనే పరిష్కారం చూపారు. నియోజక వర్గంలో తొలివిడతలో 3వేలమందికి శాశ్వత భూ హక్కు పత్రాలను అందించబోతున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎంతోమంది పేదలు దశాబ్ధాలుగా ప్రభుత్వ స్థలాల్లో చిన్న ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వీరంతా రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబాలకు చెందినవారు. కానీ వీరు నివసిస్తున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు లేవు. దీంతో వారికి ఎటువంటి అధికారిక హక్కులు లేకుండా పోయాయి.. తమకు పట్టాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇలాంటి పేదలకు అధికారంలోకి వస్తే శాశ్వత భూ హక్కు పట్టాలిస్తామని నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యపై దృష్టి పెట్టి నేడు పేదలకు పట్టాల పంపిణీ చేసే మార్గం సుగమం చేయటంతో పేదల ముఖాల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. పేదలకు ఈ భూములు ఇచ్చే విషయంలో గత పది నెలలుగాగత పదినెలలుగా అటవీ, రెవిన్యూ, ఇరిగేషన్, రైల్వే శాఖల అధికారు లతో మంత్రి లోకేష్ నిరంతరం చర్చలు జరిపారు. కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్ తో కూడా ఇటీవలచర్చించారు.ఇతర శాఖల నిబంధనల మేరకు భూమికి భూమి ఇస్తామని, పేదలు దీర్ఘకాలంగా నివసిస్తున్న స్థలాలను వారికి ఇవ్వాలని ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. మంత్రి లోకేష్ చొరవతో దీర్ఘకాలంగా పేదలు ఎదుర్కొంటున్న మొండి సమస్యకు తొలిదశ పరిష్కారం లభించింది. ఏప్రిల్ 3 న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో ఉదయం 10.59 గంటలకు అందజేయనున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 4 తేదీ నుండి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ ను అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న వేదిక పై లబ్ధిదారులకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అంద జేయనున్నారు. ఏప్రిల్ 4 న యర్రబాలెం, నీరు కొండ, కాజా గ్రామా లకు చెందిన లబ్దిదారు లకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అందజేయను న్నారు. ఏప్రిల్ 7 న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 8 న రత్నాల చెరువు, మహానాడు-2కు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబ్దిదా రులకు, ఏప్రిల్ 12 న మహానాడు-1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లోకేష్ పట్టాలు అందజేయనున్నారు. గతంలో ఎప్పుడు ఎవరి ఇళ్లపైకి పొక్లయినర్లు పంపుతారో తెలియక తీవ్ర భయాందో ళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మంగళగిరి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. దీర్ఘకాలిక మొండి సమస్యకు పరిష్కారం చూపడమేగాక శాశ్వత హక్కు సైతం కల్పిస్తుండటంతో ఆనందంతో పొంగిపోతున్నారు. తమకోసం ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న లోకేష్ తమ శాసనసభ్యుడిగా రావడం అదృష్టంగా భావిస్తున్నారు.

### లోకేష్ సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం

**-రాజమండ్రి గోవిందు, అమరారెడ్డి నగర్, ఉండవల్లి.**

రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి అనే దంపతులు ఇద్దరు బిడ్డలతో ఉండవల్లిలో నివాసం ఉంటున్నారు. 15ఏళ్ల క్రితం ఉండవల్లి అమరారెడ్డి నగర్ లోని కొండ పోరంబోకు స్థలంలో వారు ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. రజక కులానికి చెందిన గోవిందు డ్రైవర్ గా పనిచేస్తుండగా, భార్య సీతామహాలక్ష్మి బట్టలు ఉతకడం, ఇస్త్రీ పనిచేసి బిడ్డలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము ఉంటున్న స్థలానికి పట్టా ఇప్పించాలని గతంలో వారు ఎందరో ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. మంత్రి లోకేష్ గురువారం గోవిందు, సీతామహాలక్ష్మిల ఇంటికి వెళ్లి వారికి శాశ్వత హక్కు పత్రం అందించనున్నారు. విషయం తెలుసుకున్న గోవిందు కుటుంబం ఆనందంతో పొంగిపోతోంది. రాజమండ్రి గోవిందు మాట్లాడుతూ.... లోకేష్ చేస్తున్న ఈ సాయాన్ని మేం జీవితంలో మర్చిపోలేం. ఏళ్లతరబడి మేం ఎదుర్కొంటున్న కష్టాన్ని గుర్తించి కుటుంబసభ్యుడి మాదిరిగా సమస్య పరిష్కరించి, మేం ఉంటున్న స్థలంపై హక్కుకల్పిస్తున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. గతంలో ఎంతమంది చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని చెప్పారు.

# చలివేంద్రాలు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట మేజర్ న్యూస్:-**

నరసరావుపేట పురపాలక సంగం వారు. ప్రయాణికుల కొరకు. వేసవి కాలంలో దప్పిక తీర్చేందుకు ప్రతి ఒక్కరూ దాహం తీర్చుకునే విధంగా పలుచోట్ల చలి వేంద్రములు నిర్మించడం జరిగింది. అ మంచినీటి చలి వేంద్రములను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అధికారులు. పలువురు నాయకులు. ప్రారంభించడం జరిగింది..



## మున్సిపల్ కార్మికుల నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా



**నరసరావుపేట మేజర్ న్యూస్:**

14వ రోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలుసమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్.నెల మొత్తం పని చేసినా పూర్తి వేతనాలు ఇవ్వడం లేదని, అరకొర వేతనాలతో ఎలా బతకాలని మున్సిపల్ పారిశుధ్య బదిలీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం 14 రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా సంఘీభావం తెలిపి మాట్లాడారు. పని చేసినన్ని రోజులు వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కోరడం న్యాయమైన కోరిక అన్నారు. పురపాలక సంఘం అధికారులు కార్మికుల శ్రమను దోపిడీ చేయడం తగదన్నారు. 6 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు పని చేసిన అన్ని దినాలకు వేతనాలు ఇవ్వడం లేదని, మిగతా కార్మికులతో పాటు 8 గంటలు పని చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపి ఔట్సోర్సింగ్ కార్పొరేషన్లో నమోదైనా వివక్ష ఎందుకని అధికారులను ప్రశ్నించారు. పట్టణీకరణ పెరిగి నరసరావుపేట జిల్లా కేంద్రమైన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికుల యొక్క న్యాయమైన కోరికలను మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిష్కరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని సమాన పనికి సమాన వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని వారికి ఎంసిపిఐయు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సాల్మన్, నాయకులు నరసిం హారావు, జక్కుల శ్రీను, వై.ఇంద్రయ్య, కొమ్ము మరియదాసు, కె.దేవదానం, సమాధానం, నాగరాణి, జొన్నలగడ్డ వీరయ్య, జి చందు, గోదాల చిట్టిబాబు, యు. రాజు, ఎ.లత, వి.నాగమణి, పత్రా కోటేశ్వరరావు, జె.ప్రేమ్కుమార్, షేక్ ఖాదర్ వలీ, జి.రాంబాబు, సెల్విం, జగన్నాథం, సాల్మన్ పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలి: చీఫ్ విప్ జీవీ






**వినుకొండ మేజర్ న్యూస్**

ఆలస్యం, అలసత్వానికి బాధ్యత అధికారులదేనని హెచ్చరిక ప్రతివారం బుధవారం రోజున నిర్వహించే ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలను సకాలం పరిష్కరించా ల్సి బాధ్యత అధికారులపై ఉందని, లేదంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరి ంచారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా సహించబోనని, ప్రజలు మళ్లీ మళ్లీ అదే సమస్యతో రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. వినుకొండలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఈ సందర్భంగా 80 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో వివిధ కార్పొరేషన్ల లోన్లు, విద్యుత్, తాగునీరు, గృహాలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ "ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకే ప్రతి అర్జీని ఓపికగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుంటూ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. తమకు వస్తున్న ఆర్జీలను స్కాన్ చేసి కూడా పంపడం ద్వారా అధి కారుల్లో జవాబుదారీతనానికి కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో ప్రజాదర్బార్‌ను మరింత సమర్థంగా తీర్చిదిద్దుతామని, ఈ కార్యక్రమం స్ఫూర్తిని అర్థం చేసుకుని అధికారులు క్రియాశీలకం గా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు డీసీహెచ్‌ఎస్ రంగారావు బదిలీ

**నరసరావుపేట మేజర్ న్యూస్ :**



పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ (డీసీహెచ్ఎస్) ఇంఛార్జి అధికారిగా గత ఏడాది న్నరగా పనిచేస్తున్న డాక్టర్ బీవీ రంగారావు గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ నం. 188 జారీచేసిందని రంగారావు వెల్ల డించారు. కాగా, గత మూడు నెలలుగా ఆయన ప్రభుత్వ వైద్యశాల సూపరింటెం డెంట్గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో డీసీహెచ్ఎస్ఈ మరెవరినీ నియమించలేదు.

# మోదీ రాక్షస పాలనకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం..




**బొల్లాపల్లి మేజర్ న్యూస్ :-**

భారత రాజ్యాంగాన్ని, దేశ లౌకిక వ్యవస్థను రక్షించాలని పిలుపునిస్తూ కేంద్రంలో మోడీ సాగిస్తున్న నిరంకుశ, మతోన్మాద పరాకాష్టకు చేరిన రాక్షస పాలన కు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం లోని బొల్లాపల్లి మండలం లో బుధవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్ని బోయిన వెంకటేశ్వర్లు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమం మండల కేంద్రమైన బొల్లాపల్లి,వెల్లటూరు, అయ్యన్న పాలెం ,మేకలు దీన్నే, బండ్లమోటు తదితర గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు . ఈసందర్భంగా సిపిఐ వినుకొండ నియోజకవర్గం కార్యదర్శి బూదాల శ్రీనివాసరావుమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన సుదీర్ఘ పాలనలో దేశానికి నష్టం చేకూర్చడం తప్ప ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. లౌకిక భారతదేశంలో హిందూ మతాన్ని అడ్డం పెట్టుకొని నరేంద్ర మోడీ దేశంలో అరాచకాలకు తెర లేపాడని, మైనార్టీలు -దళితులపై తీవ్రమైన ఊచపోత కోస్తూ దేశంలోమతం పేరుతో మారన హోమం సావిస్తున్నాడనిభూదాల శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వక్ఫ్‌బోర్డులో సంస్కరణల పేరుతో మైనార్టీలకు చెందిన ఆస్తులను కొల్లగొట్టేందుకు మోడీ ప్రయత్నాన్ని లౌకికవాదులు వ్యతిరేకించాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు మోడీ ప్రభుత్వం వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు రాయబా రం వందనం , కొప్పరవు మల్లికార్జున రావు, చింతపల్లి రవి ,షేక్ సైదా, ఎం నరసింహారావు, ఎం. రామకోటి, రమేషు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవం



**తెనాలి, మేజర్ న్యూస్**

ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవం శాసన మండలి చైర్మన్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఎమ్మెల్సీ ఆలపాటి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి తెనాలి ప్రాంతం నుండి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అమరావతిలోని శాసన మండలికి తరలివెళ్లారు. తమ అభిమాన నాయకులు ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

**పెదకాకాని మేజర్ న్యూస్ :**



పెదకాకాని శాఖ గ్రంథాలయం గ్రంథాలయాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ ఎస్ ఎల్ ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనందరావు విచ్చేశారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ చదలవాడ అరవింద బాబు పబ్లిక్ గ్రీవెన్స్





**నరసరావుపేట మేజర్ న్యూస్:**

రూరల్ ఏరియా =54, అర్బన్ ఏరియా =145, వితంతు పింఛన్=06, ఓల్డ్ ఏజ్ పెన్షన్ =14, జొన్నలగడ్డ రైతులు హైవే అథారిటీ అలైన్మెంట్ మార్చుటం = 04, ల్యాండ్ ఇష్యూ= 03 మొత్తం 226 అర్జీలు MLA గ్రీవెన్స్ కి రావడం జరిగింది సంబంధిత అధికారులకి ఫోన్ ద్వారా తెలియపరచి తరగతినా వచ్చినటువంటి అర్జీలు వారి సమస్యలను పూర్తి చేయాలని గౌరవ ఎమ్మెల్యే అధికారులకి తెలియజేయడం జరిగింది. వార్డులోనే సచివాలయాలకు వచ్చినటువంటి అర్జీలు ని సచివాలయ ఇబ్బందికి ఫార్వర్డ్ చేసి తరగతినా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులు అందరికీ పెన్షన్ మరియు ఇంటి స్థలం కేటాయించాలని అధికారులతో మాట్లాడారుద. గత ప్రభుత్వంలో రిసర్వే ద్వారా ఇబ్బంది పడిన రైతులు సర్వే నెంబరు మార్చుటకు మరియు ఉన్న పొలం కంటే కూడా తక్కువ పొలం చేసి చూపినారు అని వాపోయారు. ప్రజావేదికలోనే పరిష్కారం చేసిన అర్జీదారులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి



**పెదకాకాని మేజర్ న్యూస్:-**

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వి. జ్యోతిర్మయి దంపతులు బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలా కుమార్ సాదర స్వాగతము పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు అష్టోత్తరం ప్రత్యేక పూజలు అనంతరము నిత్య కళ్యాణ మండపము నందు ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేయగా శ్రీ స్వామి వారి శేషవస్త్రముతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేసినారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నరసరావుపేటకి చెందిన రెండేళ్ల చిన్నారికి సోకిన బర్డ్ ఫ్లూ.

**నరసరావుపేట మేజర్ న్యూస్:**




చిన్నారి రక్త నమూనాల సేకరణతో బర్డ్ ఫ్లూతో మృతి చెందిందని పెండ్యాల ఆరాధ్య మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు నిన్న నిర్ధారణ. నరసరావుపేట పట్టణం లోని బాలయ్య నగర్ లో ఉన్న వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు. పట్టణంలో ఆ ప్రాంతాన్ని శానిటైజర్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు.

# మహిళలు భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం

**ప్రతీ ఒక్క మహిళ ఫోన్లో నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందగలరు. - జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు**



పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు,బాలికల భద్రత కొరకు శక్తి యాప్ (శక్తి యాప్) ను ప్రవేశపెట్టడం జరిగింది. కావున ఈ రోజు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నకిరేకల్లు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు విద్యార్థినులకు, అంగన్వాడీ టీచర్లకు ఆశా వర్కర్లు మరియు మహిళా సిబ్బందికి కరపత్రాలు పంచి వాటి ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే



వేధింపులు,అత్యాచారాలు, మరియు ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని కావున పల్నాడు జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ,గృహిణిలు విద్యార్థినిలు,బాలికలు వారి యొక్క ఫోన్లు నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ నకు డయల్ 112 నెంబరుకు చేరుతుందని వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ యాప్ ను ఫోన్లో నిక్షిప్తం,ఉపయోగి%శీ%చే విధానం

1.ముందుగా ఫోన్లో ఉన్న గూగుల్ ప్లే స్టోర్ (గూగుల్ ప్లే స్టోర్) ద్వారా "శక్తి యాప్" ను డౌన్లోడ్ చేసుకోవాలి. 2. మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలి. 3. ఓటిపి తో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి. 4. అత్యవసర పరిచయాలను (ఎమర్జెన్సీ కాంటాక్ట్స్) బిఫోరహేండి జోడించాలి. 5. ఏదైనా ప్రమాదం జరిగితే, యాప్ ఓపెన్ చేసి స్ ఒ స్ బటన్ ను నొక్కితే,మీ యొక్క స్థానాన్ని (లొకేషన్) గుర్తించి పోలీసులు తక్షణమే స్పందిస్తారు.

**శక్తి యాప్ యొక్క ముఖ్య ప్రయోజనాలు:**

1.అత్యవసర సహాయం – మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు,ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చు.

2.ఒక క్లిక్ స్ ఒ స్ అలర్ట్ – ఒక్క కీ నొక్కితే పోలీసులకు, కుటుంబసభ్యులకు, లేదా స్నేహితులకు అప్రమత్తమైన సందేశం వెళ్ళిపోతుంది.

3.జియో–లోకేషన్ ట్రాకింగ్ – అత్యవసర పరిస్థితుల్లో, పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదు.

4.నేరం నివేదిక (కంప్లైంట్స్ రిజిస్ట్రేషన్) – వేధింపు, లైంగిక దాడి, ఎవరైనా శారీరకంగా హాని కలిగించినప్పుడు, మహిళలు ఈ యాప్ ద్వారా నేరాన్ని అధికారులకు తెలియజేయవచ్చు.

5.సమాచార అవగాహన – మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, మరియు ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చు.

6.ప్రత్యక్ష పోలీస్ సహాయం – సమీపంలోని పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్ లైన్ నంబర్లను యాప్ లో పొందుపరిచారు.

జిల్లా మహిళలకు సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ సంధ్యారాణి ముఖ్య విజ్ఞప్తి

మహిళలు,బాలికలు,విద్యార్థినులు,ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు ఈ యాప్ ద్వారా మరింత భద్రంగా ఉండగలరు మరియు అత్యవసర సమయంలో పోలీస్ వారి యొక్క సహాయాన్ని పొందగలరు అని,మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే వివిధ పిర్యాదులు,ఇబ్బందులపై పోలీసు వారి సహాయం కొరకు శక్తి యాప్ ద్వారా పొందవలనని,

సిబ్బంది తక్షణమే స్పందించి డయల్ 112 కాల్స్ ను దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరవేస్తే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వారికి తక్షణ సహాయం, సహకారం అందిస్తారని, కావున జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు, బాలికలు,ఉద్యోగినులు, గృహిణులు మీ యొక్క ఫోన్లు నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం(డౌన్లోడ్) చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నకరికల్లు ఎస్సై చల్లా సురేష్ బాబు , నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిణి , సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ సంధ్యారాణి , కస్తూర్బా స్కూలు బోధన సిబ్బంది, విద్యార్థులు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు మరియు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించనున్న యువ నాయకులు





మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్: మాచర్ల పట్టణంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి వారి ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులో గల స్వామి వివేకానంద సేవాశ్రమం నందు పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థిని, విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ లకు సంబంధించిన ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు జూలకంటి గౌతమ్ రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

## శ్రీరాంపురం తండాలో నీటి తొట్టెల నిర్మాణ భూమి పూజ



వెల్దుర్తి, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా శ్రీరామాపురం తండా లో పశువుల నీటి తొట్టిలు నిర్మాణ కార్యక్రమాన్ని బుదవారం ప్రారంభించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వెల్దుర్తి మండలంలోని శ్రీరామపురం తండా గ్రామం నందు టిడిపి నాయకులు దేశవత్ మల్లయ్య నాయక్, ఉప్పుతోళ్ల రామకృష్ణ ల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని పశువులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా వారు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల సంరక్షణకూ, ఉపాధి కల్పనకూ ఇది సహాయ పడనుంది. ఈ కార్యక్రమంలో మండల ఎస్టి సెల్ అధ్యక్షులు దేశవత్ మల్లయ్య నాయక్, ఉప్పుతోళ్ల రామకృష్ణ, బత్తుల రామంజి, పి అంజి నాయక్, ఎస్.కె బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## దీపాల సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ

తెనాలి, మేజర్ న్యూస్ పట్టణ రంగస్థల కళాకారుల సంఘం తెనాలి ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన దీపాల సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ బిసి కాలనీలోని ఆ సంఘం కళాకారుల భవనంలో అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సినీమాటల రచయిత బుర్రా సాయి మాధవ్ పాల్గొన్నారు. దీపాల సుబ్రమణ్యం సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గరికిపాటి సుబ్బారావు, కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ, కోశాధికారి మేరిగె రామలింగేశ్వర రావు, కార్యనిర్వహణ కార్యదర్శి కనపర్తి మధుకర్,వేమూరి విజయభాస్కర్, చెరుకుమల్లి సింగారావు,పందిటి సుబ్బారావు, దేవరపల్లి భవాని, కొండలు,లక్ష్మీ తులసి, నిర్మలా రమేష్, విజయదుర్గ,జ్యోతి మరియు దీపాల సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు దీపాల తారక సాయినాథ్, పలు నాటక సమాజాల కళాకారులు హాజరై, దీపాల సుబ్రహ్మణ్యం చిత్రపటాన్ని కళాకారుల సంఘ భవనంలో ఆవిష్కరించారు. తొలుత సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జిల్లా పరిషత్తులో రేవులకు వేలం పాటలు

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :**

గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని 11 రేవులకు బుధవారం వేలం జరిగింది. 2025 ఏప్రిల్ ఒకటి నుండి2026 మార్చి 31 వరకు ఈ రేవులు వేలంపాట దారుల ఆధీనంలో ఉంటాయి. మొత్తం 11 రేవులకు వేలం నిర్వహించగా, ఏడు రేవులకు మాత్రమే వేలం జరిగింది. మిగిలిన నాలుగు రేవులకు సంబంధించి ఎవరు వేలంపాటలో పాల్గొనలేదు. దీంతో మిగిలిన రేవులకు వేలంపాట ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు . ఈ వేలం ద్వారా జిల్లా పరిషత్ కు ఒకకోటి 40 లక్షల 7వేల 526 ఆదాయం సమకూరనుంది. జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి జ్యోతి బస్, ఉపముఖ్య కార్య నిర్వహణ అధికారి సిహెచ్ కృష్ణ వేలంపాటలను నిర్వహించారు.





## మున్సిపల్ ఆఫీస్ లో బీసీ కార్పొరేషన్ లోన్ల క్రెడిట్ క్యాంప్

మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్: మాచర్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బీసీ, ఈ బీసీ కార్పొరేషన్ లోన్ కోసం జరిగిన క్రెడిట్ క్యాంపులకు 836 లబ్ధిదారులు ఆన్లైన్ చేసుకోగా, వారిలో 437 మంది క్రెడిట్ క్యాంపు నకు బుధవారం హాజరయ్యారు. ఈ క్రెడిట్ క్యాంప్ నందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాచర్ల, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాచర్ల తో పాటుగా. 7 బ్యాంకుల సిబ్బంది పాల్గొని, రుణ గ్రహీతలకు సంబంధించిన పత్రాలను వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇద్దరి మధ్య గొడవను రెడ్‌బుక్ రాజ్యాంగమని ఎలా అంటారు మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ మేజర్ న్యూస్**

బ్రహ్మనాయుడు, వైకాపా నిజాలు తెలుసుకుని మాట్లాడాలి: మక్కెనఎక్కడో తిరునాళ్లలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ, అనంతర పరిణామాలను రెడ్‌బుక్ రాజ్యాంగం , రాజకీయ పరమైన దాడులు ఎలా అంటారంటూ బొల్లా బ్రహ్మనాయుడు, వైకాపాను ప్రశ్నించారు తెలుగుదదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు. మేళ్లవాగు అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా గుమ్మనంపాడుకు చెందిన ఒక ముస్లిం వ్యక్తి, సాంబిరెడ్డి అనే ఇద్దరి మధ్య వివాదం జరిగిన మాట వాస్తవం అని, ఆ కారణంగా తర్వాత ఇరువర్గాల మధ్య తగవులు జరిగాయని.. దానిని పట్టుకుని బొల్లా తప్పుడు రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రచారంపై బుధవారం ఈ మేరకు స్థానిక నేతలతో కలసి మీడియాతో మాట్లాడారు మక్కెన. వైకాపా యూత్ పార్టీ నాయకులు అయిన సాంబిరెడ్డి, అతడి బృందం గురించి ఊరిలో ఎవర్ని అడిగినా చెబుతారని, ఆ నిజాలన్నీ దాచి బొల్లా రాజకీయపరమైన లబ్దికోసం లేని విషయాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన స్వల్ప వ్యవధిలోనే చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్థానికంగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంటే చూసి ఓర్చుకోలకనే ఇలా... వైకాపాకు అలవాటైన తప్పుడు ప్రచారాన్ని మార్గంగా ఎంచుకున్నట్లు కనిస్తోందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న బిజెపి ఇన్చార్జ్ లెనిన్ కుమార్, పెమ్మసాని నాగేశ్వరరావు,బారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



# జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో ఐఐటి పై అవగాహన సదస్సు

**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :**

విద్యార్థుల విద్యార్థి దశ నుండి వినూత్న ఆలోచనలను ఆరంభించి వినూత్న ఆవిష్కరణలకు అడుగులు వేయడం ద్వారా అత్యున్నత ఐఐటీని సాధించడం సులభతరం అవుతుందని ఐఐటి మద్రాస్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ యు.వి. వరదరాజు పేర్కొన్నారు. స్థానిక జేమ్స్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు ఐఐటి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఐటి మద్రాస్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ యు.వి. వరదరాజు, ఎస్.ఆర్.ఎమ్ యూనివర్సిటీ కెమిస్ట్రీ హెచ్ఓడి డాక్టర్ పార్థసారథి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. పాఠ్యపుస్తకాలలోని సారాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని దానిని అమలు చేయడం ద్వారా అత్యున్నత ఫలితాలు అందుతాయని ఆ దిశగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని సూచించారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులు జీవితంలోని ప్రతి దశను, ప్రతి నిమిషాన్ని ఆస్వాదించి విజయతీరాలకు చేరాలన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం అవ్వకుండా చదువుకున్న పాఠ్యాంశాన్ని ప్రయోగం రూపంలో ప్రదర్శించడం ద్వారా మరింత అవగాహన ఏర్పడి కొత్త ఆలోచన నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని ఇది విద్యార్థి దశ నుండి అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు విద్యార్థి యొక్క ఆలోచనలకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ వారిలోని వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా ప్రతిరోజు నూతన ఆవిష్కరణలు నూతన విద్యా విధానాలను అవగాహన చేసుకుంటూ విద్యార్థికి సులువైన మార్గంలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు.



ముఖ్యంగా జేమ్స్ పబ్లిక్ స్కూల్ లోని విద్యార్థులు ఆలోచనలు చాలా ఉన్నతంగా ఉన్నాయని ముఖ్యంగా పాఠ్యాంశాన్ని త్వరితగతిన అవగాహన చేసుకుని దానిలో అనేక రకాల ప్రశ్నలను లేవనెత్తే విధానం ఆశ్చర్యాన్ని కలిగించిందని ఈ విధంగా విద్యార్థులను అత్యున్నత విద్య బోధన పద్ధతుల ద్వారా అత్యుత్తమ విద్యార్థులుగా తయారు చేస్తున్న జేమ్స్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని ఉపాధ్యాయులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రసన్న జాయ్, మేనేజర్ మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోళ్ల ఫారాలను తనిఖీ చేసిన అధికారులు



**వినుకొండ మేజర్ న్యూస్ :** ఆకస్మిక తనిఖీల్లో భాగంగా నరగాయపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని వెంకుపాలెం బ్రాయిలర్ కోళ్ళ ఫారంను ,పెదకంచర్ల రైతు సేవా కేంద్రం పరిధిలోని కోటప్ప నగర్ బ్రాయిలర్ కోళ్ళ ఫారంను ఈపూరు మండలంలోని చిట్టా పురం, శ్రీనగర్ కోళ్ళ ఫారాలనుర జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.కాంతారావు బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా బ్రాయిలర్, లేయర్ కోళ్ళ ఫారం లోని ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్థారించారు.పౌల్ట్రీ ఫారం రైతులు కాళంగి శ్రీనివాసరావు,దావులూరి రంగారావు లను ఫారంలో తీసుకుంటున్న బయో సెక్యూరిటీ పద్దతులను గురించి అడిగి తెలుసుకున్నారు.బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఫారంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు.అదేవిధంగా బ్రాయిలర్ కోళ్ళకు మేత పద్దతులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు.అదేవిధంగా ఏ విధమైన ఆరోగ్య సమస్యలు కోళ్ళకు వస్తున్నట్లు వుంటే స్థానిక పశు వైద్య అధికారిని సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ సహాయ సంచాలకులు డాక్టర్ బి సరోజా దేవి, ఈపూరు సహాయ సంచాలకులు డాక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి, కొండ్రముట్ల పశువైద్య అధికారి డాక్టర్ వి.గోపాల్ నాయక్,పశుసంవర్ధక సిబ్బంది నాగరాజు,శివ శంకర్,శిరీషలు పాల్గొన్నారు.



# పారిశుధ్యంపై నిర్లక్ష్యం ఎందుకు?

- మురుగుతో ప్రజలు బాధపడాలా ?
- స్వచ్ఛ సర్వేషన్‌తో సరిపెడితే పారిశుధ్యం కనిపించదా ?
- మునిసిపల్ అధికారులకు బాధ్యత లేదా ?
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్
- వసంతరాయపురం, రాజీవ్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

పారిశుధ్యంపై ఎందుకు అంత నిర్లక్ష్యం.. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు ఆలకించరు. మురుగుతో ప్రజలు అల్లాడుతుంటే కనీసం పట్టించుకోరా.. స్థానిక ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసినా సంబంధిత అధికారులు అందుబాటులో ఉండరా? ప్రజలకంటే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలు ఎక్కువయ్యాయా? అంటూ మునిసిపల్ అధికారులపై ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని రాజీవ్ నగర్ లో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కు వెళ్లిన ఎమ్మెల్యేకు స్థానిక పారిశుధ్యం బాగాలేదంటూ ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులు ఎక్కడంటూ ప్రశ్నించారు. ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. పారిశుధ్యం అధ్వానంగా ఉంటే ప్రజలు ఎలా నివసిస్తారని అధికారులను నిలదీశారు. ఇదేనా జీఎంసీ పని తీరు అని ప్రశ్నించారు. అనంతరం వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించబోమని హెచ్చరిం చారు.

**రూ.1.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

గుంటూరులోని రాజీవ్ నగర్ 9వ లైన్ ఎక్స్టెన్షన్ లో 75 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్స్, సీసీ డ్రైన్స్ మరియు వసంతరాయపురం 3వ లైన్ లో రూ.39 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి శకం ఆరంభమైందని తెలిపారు. ప్రతి ప్రాంతాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నామని, దీనికి ప్రణాళికాయుతంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గుంటూరు మునిసిపాలిటీని సుందరంగా మారుస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మీద సజీల, కార్పొరేటర్ భారతి, దయా రత్నం, గొల్ల ప్రభాకర్, ఆనంద్, వాణి, చిట్టిబాబు, సింధు, కిషోర్, నవీన్, తిరుపతిరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగపర్చుకోండి : ఎమ్మెల్యే జూలకంటి



**మాచర్ల ప్రతినిధి, మేజర్ న్యూస్ :** మాచర్ల నియోజకవర్గం లోని నిరుద్యోగులు స్థానిక ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల నందు గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించే మెగా జాబ్ మేళాను నియోజకవర్గ యువత సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ వ్యాపార దిగ్గజం అమరరాజా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. గ్రోత్ కారిడార్ లో ఆపరేటర్లు, అప్రెంటీస్ షిప్ ట్రైనీ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ కనీస విద్యా అర్హతలు ఉంటే చాలు అని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ముందుగా స్టైఫండ్ కింద రూ 12 నుంచి రూ. 15 వేలు, భోజన వసతి ఉంటుందన్నారు. ట్రైనింగ్ పీరియడ్ పూర్తి అయిన అనంతరం నెలకు రూ. 22 వేల జీతంతో కేరియర్ ప్రారంభమవుతోందని వెల్లడించారు. యువత తప్పనిసరిగా ఈ సదావకాశాన్ని సద్వినియోగపర్చుకోని,ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.



నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాలోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | | | |
|---|---|---|---|
| పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987 | ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466 | |
| ఎం.ఏడుకొండలు సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455 | జి.హిరన్మాయి (కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్ | చెట్టిపోగు కాశి దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327 | |
| శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201 | వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951 | చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635 |
| యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149 | వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200 | డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453 | జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959 |
| వి.వెంకటరెడ్డి బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991 | బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676 | రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840 |
| కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000 | డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987 | పి.మణికంఠ మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885 | ఎస్.డి.మహబూబ్ మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898 | పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723 | ఎస్.విజయభాస్కర్ గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538 | షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300 | ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169 |
| డి.మల్లికార్జునరావు యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441 | పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239 | నాగరాజు మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913 | రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600 |
| తేళ్ల రవీంద్రబాబు గుంటూరు రిపోర్టర్ సెల్ : 7396234032 | | | |

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.